క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో ఆర్మూర్‌కు చెందిన సుశ్రుత పిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 16 సంవత్సరాల లోపు పిల్లలకు డాక్టర్ జైడి గణేష్‌రెడ్డి, జైడి మౌనికా రెడ్డిలు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు సరఫరా చేశారు.

నలంద విద్యార్థులకు అవార్డులు



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి నలంద హైస్కూల్ విద్యార్థులు ఈ- అభ్యాస్ వారి ఒలంపియాడ్ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆదివారం నిర్వహించిన అభ్యాసోత్సవ్-2023 కార్యక్రమంలో విద్యార్థులకు అవార్డులను అందజేశారు. అవార్డులు పొందిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ నలంద ప్రసాద్, నలంద సాగర్ అభినందించారు.

రంజాన్ కానుకల పంపిణీ



రుద్రూర్: మండల కేంద్రానికి ప్రభుత్వం సరాఫరా చేసిన రంజాన్ కానుకలను ఆదివారం లబ్ధిదారులకు స్థానిక మైనారిటీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ షేక్ సుభాని, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, మజీద్ సదర్ మహమ్మద్ ఇమ్రాన్, సయ్యద్ ముల్తానీ, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట మండల కేంద్రంలో..




నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో ఎంఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రంజాన్ పండుగను పురస్కరించుకుని 35 ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుకలు అందజేశారు. పేదల ఆకలి తీర్చేందుకు ఎంఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 846 రోజులుగా నిరంతరం నిత్యాన్నదానం చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

సరోజనమ్మ సామాజిక సేవలు అభినందనీయం



బోధన్: విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు గుర్రాల సరోజనమ్మ సామాజిక సేవలు అభినందనీయమని పట్టణ కేంద్రానికి చెందిన ప్రముఖ సోషల్ వర్కర్ అశోక్ రోడే అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఆమె స్వగృహంలో సరోజనమ్మను సన్మానించారు. కులమతాలకతీతంగా అనాథలు, నిరాశ్రయులు, అద్దె ఇళ్లలో ఉండే పేదలు తమ కుటుంబ సభ్యుడి అంతిమ సంస్కారాలు నిర్వహించుకునేందుకు సౌకర్యం కల్పించేందుకు సొంత డబ్బులు రూ.20 లక్షల వరకు ఖర్చు పెట్టి నిర్మించిన ధర్మ స్థలం భవనం ప్రారంభించారని పేర్కొన్నారు. ఆమె సామాజిక సేవలు భావితరానికి ఆదర్శమని తెలిపారు.

ఆలయానికి భూవిరాళం



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని లక్కంపల్లిలో యోగేశ్వర ఆలయం నిర్మాణం కోసం స్థానికులైన గంధ్ర శ్రీనివాస్‌రావు, ప్రసాదరావులు తమ స్వంత భూమిని విరాళంగా అందజేశారు. స్వాధ్యాయ పరివారం భవిష్యత్తు అవసరాల కోసం తన వంతు సహకారం అందిస్తున్నట్లు వారు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బాల్కొండ: మండల కేంద్రంలో అంబేడ్కర్ కాలనీలో రూ.10 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం సర్పంచ్ బూస సునీత ప్రారంభించారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.90 లక్షలు మంజూరయ్యాయన్నారు. మంజూరుకు కృషి చేసిన మంత్రి ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాహబ్, వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నేతలు లింగాగౌడ్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

నత్తనడకన సబ్‌స్టేషన్ పనులు

- పనులు ప్రారంభానికి ఏడాదిన్నర.. పూర్తవ్వడానికి ఎన్నాళ్లో..!
- త్వరగా పూర్తి చేయాలంటున్న స్థానికులు



నల్లూర్‌లో సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసినప్పటి శిలాఫలకం



బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న పనులు

బాల్కొండ: ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మాణం కోసం 2021, సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించడానికి ఏడాదిన్నర సమయం తీసుకున్నారు. పనులు పూర్తి చేయడానికి ఎన్నాళ్లు పడుతుందోనని గ్రామస్తులు అనుకుంటున్నారు. నెల రోజుల క్రితం పనులు ప్రారంభమైనా ఇప్పటికి బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. పనులు నత్తక నడక నేర్పేలా సాగుతున్నాయి. ముప్కాల్ మండలంలో ఏడు గ్రామాలు ఉన్నాయి. అందులో ఐదు గ్రామాల్లో విద్యుత్తు సబ్ స్టేషన్‌లు ఉన్నాయి. నల్లూర్, నాగంపేట్ గ్రామాల్లో సబ్ స్టేషన్‌లు లేవు. నల్లూర్‌లో ఎట్టకేలకు పనులు ప్రారంభమయ్యాయి. కాని నాగంపేట్‌లో ఇప్పటికి సబ్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. నల్లూర్‌లో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు. విద్యుత్తు సబ్‌స్టేషన్ లేక ముప్కాల్ మండల కేంద్రం సబ్ స్టేషన్ నుంచి నల్లూర్‌కు విద్యుత్ సరఫరా జరుగుతోంది. దీంతో విద్యుత్తు లోవోల్టేజీ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఉన్నత అధికారులు స్పందించి వెంటనే పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కూడా కాపాడాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

ఏఐకేఎంఎస్ సభలను విజయవంతం చేయండి



బోధన్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

బోధన్: యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు పట్టణ కేంద్రంలో ఈ నెల 25 నుంచి 27 వరకు జరుగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ద్వితీయ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం బోధన్ ఉమ్మడి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దార్లె భూమన్న, గంపల పోశెట్టిలు కోరారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ ఆఫీసులో మహాసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మహాసభల తొలి రోజు రైతు కూలీ భారీ ప్రదర్శన, బహిరంగ సభలు ఉంటాయని, మరుసటి రెండు రోజులు సంఘ ప్రతినిధుల సభ కొనసాగుతోందని వివరించారు. వ్యవసాయ రంగం సమస్యలపై సంఘ జాతీయ నేతల ప్రసంగాలుంటాయని వెల్లడించారు. నాయకులు దేవిదాస్, షేక్ నజీర్, గంగారాం పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే రోడ్ల విస్తరణ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యెండల

కమ్మర్‌పల్లి: రాష్ట్రంలో కేంద్ర నిధులతోనే రోడ్ల విస్తరణ జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం ఆయన కమ్మర్‌పల్లిలో మాట్లాడారు. రాష్ట్ర రహదారులకు కేంద్రం వేల కోట్ల రూపాయలు ఇచ్చిందని తెలిపారు. రూ. 1000 కోట్లు కేటాయించిన చరిత్ర కేంద్ర ప్రభుత్వానికి ఉందని గుర్తు చేశారు. ప్రధాన మంత్రి సడక్ యోజన కింద వేలాది కిలోమీటర్లు రోడ్లు రాష్ట్రంలో చేపడుతున్నారని వివరించారు. ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్ రైల్వేలైన్ కోసం సీఎం కేసీఆర్ లేఖ ఇస్తే కేంద్రం రూ.2,700 కోట్ల ప్రాజెక్టును మంజూరు చేసిందని, నిధులు తెచ్చే దమ్ము లేదని విమర్శించారు. నాయకులు గంగారాం, రంజిత్, చింత హన్మంతు పాల్గొన్నారు.

ఆర్థిక మోసాలపై అజాగ్రత్తగా ఉండొద్దు



మాట్లాడుతున్న ఏఎస్సై దయాళ్‌సింగ్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఆర్థిక మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా మోసపోతే 1930 నెంబర్‌కు వెంటనే ఫోన్ చేయాలని ఏఎస్సైలు దయాళ్‌సింగ్, రమేష్ సూచించారు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రం శివారులోని ఫిల్టర్ బెడ్‌లో వాహనదారులు, ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారించాలంటే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఎవరికి కూడా ఏటీఎం నెంబర్లు, బ్యాంకు ఖాతాలు, ఓటీపీ నెంబర్లు చెప్పవద్దని సూచించారు.

టెక్నాలజీ ద్వారా మంచితో పాటు నష్టం జరిగే ఆస్కారమున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పేకాట ఆడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా భవిష్యత్‌పై దృష్టిసారించాలని తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



కానుకలు అందజేస్తున్న ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని బీఆర్‌ఎస్ నేత ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మార్కెట్‌యార్డులో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీల అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. అనంతరం మహిళలకు రంజాన్ కానుక అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, జెడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ పస్క నర్సయ్య, తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహన్ కౌన్సిలర్ ఇంతియాజ్, ఫయాజ్, అతిక్, రహమాన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి



సభ్యులకు చెక్కును అందజేస్తున్న దయానంద్

ఆర్మూర్‌టౌన్: ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ధ్యాన రత్న శైలజ అన్నారు. పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై నిర్మాణంలో ఉన్న నవనాథ సిద్దేశ్వర మహా పిరమిడ్ ధ్యాన మందిరం ధ్యాన ఆత్మజ్ఞాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాకాహారంను భుజించడం వల్ల రోగాలు దరి చేరవన్నారు. పిరమిడ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. పీఎస్ఎస్ఎం నవనాథపురం కమిటీ సభ్యులు నల్ల గంగారెడ్డి, సాయి కష్టారెడ్డి, పెంబర్తి నారాయణ, కొనింటి శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

సిద్దుల గుట్టపై నిర్మిస్తున్న మహా పిరమిడ్ ధ్యాన మందిర నిర్మాణానికి విశ్రాంత జిల్లా పంచాయతీ అధికారి పిరమిడ్ మాస్టర్ బొడ్డు దయానంద్ రూ. 51,116 విరాళాన్ని చెక్కు రూపంలో నవనాథపురం కమిటీ సభ్యులకు అందజేశారు.

సీపీఐ పల్లె బాట వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో ఇంటింటికి సీపీఐ వాల్‌పోస్టర్లను ఆదివారం పార్టీ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పార్టీ పిలుపు మేరకు బీజేపీ హఠావ్.. దేశ్‌కో బచావ్ అనే నినాదంతో పల్లెబాట కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి ఉద్యమిస్తామన్నారు. నాయకులు నల్ల గంగాధర్, బాలాగౌడ్ పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ విగ్రహం..



భీమ్‌గల్: బడా భీమ్‌గల్‌లో ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఆదివారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రితో కలిసి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఒక సామాన్య కుటుంబంలో పుట్టి, స్వశక్తితో ఎదిగి భారత ఉప ప్రధానిగా దేశానికి సేవలందించిన గొప్ప వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్ అని అన్నారు. మంత్రిగా పని చేసి బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన దార్శనికుడు ఆయన అని కొనియాడారు. అలాటి మహోన్నత వ్యక్తి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న బడా భీమ్‌గల్ ప్రజల నిర్ణయం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం



భీమ్‌గల్: పట్టణ కేంద్రంలో డాక్టర్ మధు శేఖర్ ఆధ్వర్యంలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఆదివారం ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్‌లో రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చేయుత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో భీమ్‌గల్ ప్రాంతంలో 100 పడకల ఆస్పత్రి వీలైనంత త్వరగా అందుబాటులోకి తేవడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. అప్పటి వరకు డాక్టర్లు ఇలాంటి హెల్త్ క్యాంప్‌లు పెడుతూ ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరారు.

వాల్ ఆఫ్ కైండ్‌నెస్‌కు విశేష స్పందన



ఆర్మూర్: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఆదర్శ మిత్రుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్ ఆఫ్ కైండ్‌నెస్‌కు విశేష స్పందన లభిస్తోంది. తమ ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న దుస్తులు, వస్తువులను ఇక్కడ పెట్టి వెళ్తే అవసరం ఉన్న వారు ఉచితంగా తీసుకెళ్తున్నారు. అందులో భాగంగా పట్టణానికి చెందిన సమాజ సేవకుడు తులసి కుమార్ తమ ఇంట్లోని పలు వస్తువులను ఆదివారం వాల్ ఆఫ్ కై ండ్‌నెస్‌లో అందజేసారు. దుస్తులు అవసరం ఉన్న వారు ఇక్కడి నుంచి తీసుకెళ్లాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కమ్మర్‌పల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి



మోతెలో.. డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి



హంగర్గాలో..సంఘం ఉపాధ్యక్షుడు పవన్ కుమార్

కమ్మర్‌పల్లి : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ వైస్ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి కోరారు. ఆదివారం కమ్మర్‌పల్లిలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏ-గ్రేడ్ వరి ధాన్యం క్వింటాలుకు రూ.2,060, బీ-గ్రేడ్ ధాన్యానికి రూ.2,010 మద్దతు ధర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ మండలంలో..

వేల్పూర్ : మోతె, అక్లూర్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీసీసీబీ వైస్ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. సరైన తేమశాతం ఉండే విధంగా ధాన్యాన్ని ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలని ఆయన సూచించారు. సొసైటీ చైర్మన్ మోతె రాజేశ్వర్, వైస్ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, సర్పంచులు చంద్రమోహన్ గౌడ్, నాగధర్ రెడ్డి, ఎంపీటీసీ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పొతంగల్ మండలంలో..

రుద్రూర్: పొతంగల్ మండలం హంగర్గలో విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంఘం ఉపాధ్యక్షుడు గంధపు పవన్ కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని అన్నారు. విండో డైరెక్టర్ విజయ్ పటేల్, ఉప సర్పంచ్ పుట్టి సుభాష్, కోటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ నీరడి గంగాధర్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో..

నవీపేట: బినోల సొసైటీ పరిధిలోని బినోల, నాళేశ్వర్, నిజాంపూర్, ఆశాజ్యోతి కాలనీలలో చైర్మన్ మగ్గరి హన్మాండ్లు ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి గిట్టుబాటుధరను పొందాలని ఈ సందర్భంగా రైతులను కోరారు. ఎంపీపీ సంగెం శ్రీనివాస్, బినోల సర్పంచ్ పీతాంబర్, నాళేశ్వర్ ఎంపీటీసీ శ్యామల, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో బీసీలకు అన్యాయం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

రుద్రూర్: పొతంగల్ మండలం హెగ్డోలిలో ఆదివారం పల్లె పల్లెకు ఓబీసీ ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీనేతలు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గించారని, రాష్ట్ర మంత్రివర్గంలో ముగ్గురు బీసీలకు మాత్రమే స్థానం కల్పించారని అన్నారు. 2014లో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేసిందని, రాష్ట్రంలో బీసీ జనాభా, వారి స్థితిగతులు, ఆర్థిక వెనుకబాటుతనం, వివరాలు సేకరించిన ప్రభుత్వం ఇప్పటికీ బహిర్గతం చేయలేదన్నారు. బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా బలపడకుండా అణచివేతకు గురవుతున్నారని వ్యాఖ్యానించారు. నాయకులు శేఖర్, నాగనాథ్ పటేల్, సాయినాథ్ సందీప్, మారుతి, విలాస్, శివలింగ్ పాల్గొన్నారు.

పేదలందరికీ ‘డబుల్’ ఇళ్లు ఇవ్వాలి



బోధన్‌లో వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నేతలు

బోధన్: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలున్న వారికి ఇళ్లు కట్టుకునేందుకు రూ.10 లక్షలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా బోధన్ సబ్ డివిజన్ కార్యదర్శి బి. మల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా మంజూరు చేయడం లేదని పేర్కొన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్ల పాలనలో పట్టణ కేంద్రంలో ఏ ఒక్కరికి డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని తెలిపారు. అద్దె ఇళ్లల్లో ఉంటున్న పేదలు నెలసరి అద్దెలు కట్టేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు, సొంత స్థలాలున్న వారికి ఇళ్ల రుణాలు, రేషన్ కార్డుల సమస్య పరిష్కారం కోసం ఈ నెల 20న తమ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపు నిచ్చిందన్నారు. ప్రజా సంఘాల నాయకులు పడాల శంకర్, నాగమణి, అర్షద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న తపస్ నాయకులు

నిజామాబాద్‌అర్బన్: టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ కేంద్రం వద్ద తపస్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి మాట్లాడుతూ.. 317 జీవోను రద్దు చేయాలన్నారు. ఈ మేరకు డీఈవో దుర్గాప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. నిరసనలో తపస్ నాయకులు రాఘవ రెడ్డి, సంతోష్, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ.. ర్యాలీ

నగరంలో వివిధ ఉపాధ్యాయ సంఘాలు సీపీఎస్ రద్దు కోరుతూ నిరసన ర్యాలీ చేపట్టాయి. కంఠేశ్వర్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, యూటీఎఫ్ అధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిటీని ప్రకటించాలి

పీఆర్‌సీ కమిటీని వెంటనే ప్రకటించి టీచర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృపాల్ సింగ్ డిమాండ్ చేశారు. ఆదివారం సంఘ కార్యలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేసవి సెలవుల్లో టీచర్లకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. నాయకులు రవీందర్, నాగేశ్వర్, వాసుదేవరావ్, బుచ్చన్న పాల్గొన్నారు.

సమాచారం..

నేడు దివ్యాంగులకు ఇంటర్వ్యూలు

ఆర్మూర్‌టౌన్: పట్టణ పరిధిలోని దివ్యాంగులకు ఆర్థిక పునరావాస పథకం కింద లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ప్రసాద్ చౌహన్ తెలిపారు. సోమవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తుదారులు ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే పల్లకిసేవ ఉంటుందని పేర్కొన్నారు.